సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 3 । జనవరి । 2023



వంగ సాగు..లాభాలు బాగు

జిల్లాలో టమాట, పూలతోటల సాగుతో నష్ట పోయిన రైతులను ప్రస్తుతం వంగ సాగు ఆదుకుంటోంది.

-8లో..



విహారం.. విషాదం

విహారం విషాదంగా మారింది. పెద్దేరు ప్రాజెక్టు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ఇద్దరు యువకులు రోడ్డుప్రమాదంలో మృతి చెందారు.

-8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.134	రూ.180
రెండోరకం	రూ.80	రూ.130

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 78 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా వసంత



కలెక్టర్‌కు పూలబొకే అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత

మదనపల్లె సిటీ: అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) సెక్రటరీగా పీడీ వసంత సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ గిరీషా, డీఈఓ రాఘవరెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే డీఎస్‌డీఓ షేక్‌షఫీతో క్రీడల గురించి చర్చించారు. వసంత మాట్లాడుతూ పాఠశాలల్లో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటిటౌన్ : జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చిత్తూరు జిల్లా నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022–2023లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని చెప్పారు. 3 నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ లేదా ఎయిడెడ్, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల్లో చదివిన వారు మాత్రమే ఈ పరీక్ష రాయడానికి అర్హులన్నారు.ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 29వ తేదీన జరుగుతందని తెలిపారు. https://cbseitms.rcil.gov.in/nvs, www.navodaya.gov.in, https://www.navodaya.gov.in/nvs/nvs-school/CHITTOOR/en/home/ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చిత్తూరు జిల్లా విభజన జరగక ముందు చిత్తూరు జిల్లా పరిధిలోని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

వైకుంఠ వైభవం..

- ఘంగా ముక్కోటి ఏకాదశి
- కిక్కిరిసిన వైష్ణవాలయాలు
- ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న భక్తులు
- పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు





ఒంటిమిట్ట: ఉత్తర ద్వారం వద్ద భక్తులకు దర్శనమిస్తున్న సీతారామలక్ష్మణులు, స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



నందలూరు సౌమ్యనాథాలయంలో భక్తులకు దర్శనిమిచ్చిన స్వామి, అమ్మవార్లు

రాయచోటి: ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పర్వదినాన్ని సోమవారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాల్లోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రతి ఆలయంలో వైకుంఠ ద్వారాన్ని విశేషంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు.ప్రభుత్వ గుర్తింపుగల ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో తిరుమల–తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి పూజలను వైభవంగా నిర్వహించారు. ఉత్తర గోపురాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి అటువైపునుంచి భక్తులను దర్శనాలకు అనుమతించారు. నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయంలో కూడా అన్నమయ్య జిల్లా ఏర్పాటయ్యాక తొలిసారి వైకుంఠ ఏకాదశి రావడంతో ఆలయ నిర్వాహకులైన టీటీడీ అధికారులు, మేడా కుటుంబ సభ్యులు కూడా ఉత్తర గోపురం వద్ద వైకుంఠ ద్వారాన్ని కనుల పండువగా అలంకరించి భక్తులను దర్శనాలకు అనుమతించారు. వైఎస్సార్ జిల్లాలోని ప్రముఖ వైష్ణవాలయం దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ద్వారాన్ని అందంగా అలంకరించారు. స్వామి ఆలయం నుంచి పాతకడప రోడ్డులోని శివాలయం వరకు భక్తులు ఆరు వరుసల క్యూలో వేచి ఉండి మరీ దర్శనం చేసుకున్నారు.

- ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి దర్శించుకున్నారు.
- రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌లు తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి చేయ్యేరు నది ఒడ్డున ఉన్న శ్రీ షిర్డీసాయి మందిరంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆర్డీఓ మురళి, మునిసిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి పట్టణంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు



దేవునికడపలో వైకుంఠ ద్వారంలో భక్తులకు అభయమిస్తున్న కడప రాయుడు, వైకుంఠ ద్వార దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఈపీ, జెండర్ నిష్పత్తిని పక్కాగా పరిశీలించాలి

జిల్లా ఎన్నికల పరిశీలకులు ప్రద్యుమ్న



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు ప్రద్యుమ్న. చిత్రంలో కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జిల్లాలో 2023 ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా రూపకల్పన జాబితాలో నమోదైన ఈపీ, జెండర్ నిష్పత్తిని పక్కాగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు ప్రద్యుమ్న పీఎస్ ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియోకాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌తో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 13,58,734 ఓటర్లు ఉన్నారని ఎలక్టోరల్ పాపులేషన్ రేషియో 704గా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్‌కు సంబంధించి ఆగస్టు ఒకటి నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు 34,927 విజ్ఞప్తులు అందగా 20977 అంగీకరించినట్లు చెప్పారు. 8260 విజ్ఞప్తులను తిరస్కరించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఎన్నికల పరిశీలకులు ప్రద్యుమ్న పీఎస్ మాట్లాడుతూ క్లైమ్స్ అండ్ ఆబ్జెక్షన్స్ దరఖాస్తులను పెండింగ్ లేకుండా లేకుండా పరిశీలన చేసి పరిష్కరించాలన్నారు. జిల్లాలో పోలింగ్‌స్టేషన్లపై అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలపాలన్నారు. ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధానం కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లె ఆర్డీఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

శాఖలపై హెచ్‌ఓడీల పర్యవేక్షణ తప్పనిసరి

- అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : అన్నమయ్య జిల్లాలోని వివిధ శాఖల్లో ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ఆయా శాఖల హెచ్‌ఓడీల పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ జయరాజు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని హెచ్‌ఓడీలు తమ పరిధిలో జరిగే కార్యక్రమాలకు సంబంధించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. దీని వల్ల కింది స్థాయి సిబ్బంది మరింత బాగా పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన కార్యక్రమంలో ఎక్కువగా సివిల్ సప్లై, భూసమస్యలు, డీపీఓ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలు వస్తున్నాయని వీటిపై ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

స్పందన కార్యక్రమంలో కొన్ని సమస్యలు:

- కేవీపల్లె మండలం వి.కొత్తపల్లెకు చెందిన సి.వెంకటేశ్వరరెడ్డి ఇంటర్ వరకు చదివానని తనకు ఉపాధి కల్పించాలని కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పించారు.
- రాజంపేట మండలం రామ్‌నగర్‌కు చెందిన ఎస్.జాఫర్‌హుస్సేన్ వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయించాలని స్పందనలో అర్జీ ఇచ్చారు.
- సుండుపల్లె మండలం సుండుపల్లెకు చెందిన ఏ.వెంకటస్వామి సర్వే నంబర్ 126/7లో 55 సెంట్ల భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారని విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని విన్నవించారు.
- రామసముద్రం మండలం దిన్నెపాడు గ్రామానికి చెందిన ఎస్.వెంకటసుబ్బయ్య తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయించాలని అర్జీ అందజేశారు.

ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని ప్రజల వినతులను జతచేస్తూ జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పంటసాగుదారు హక్కు పత్రం పోస్టర్ విడుదల

రాయచోటి: పంటసాగుదారు హక్కుపత్రం పోస్టర్లను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ చేతుల మీదుగా విడుదల చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమా మహేశ్వరమ్మ, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు కల్పించే ప్రయోజనాలను సీసీఆర్‌సీ పత్రం పొందే విధానం, యజమానులకు భరోసా తదితర విషయాలపై పోస్టర్ ద్వారా ముద్రించి కౌలు రైతులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈ పత్రం అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోని నోటీసు బోర్డుల్లో ఏర్పాటు చేయించాలని వ్యవసాయ అధికారులకు కలెక్టర్ సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా క్రింద ఏడాది రూ. 13500లు పెట్టుబడి సాయం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, ల్యాండ్ అండ్ సర్వే ఏడి జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాల తనిఖీ



అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మీ

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామ పంచాయతీ చివాలయాన్ని రెడ్డివారిపల్లె, దేవలంపేటలోని అంగన్వాడీ కేంద్రాలను ఇన్‌చార్జి ఐసీడీఎస్ పీడీ, జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మీ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, హాజరుపట్టికలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజుల రిజిస్ట్రేషన్‌పై అవగాహన



దస్తావేజుల రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పిస్తున్న శివరాం

కడప కోటిరెడ్డిసర్కిల్ : దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేస్తే కలిగే లాభాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల రిజిస్ట్రేషన్ల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ బి.శివరాం తెలిపారు. సోమవారం సాయంత్రం కడప అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో భూములు, స్థలాల క్రయ విక్రయదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల క్రయ విక్రయాల సమయంలో రిజిస్ట్రేషన్ చేసే విషయంగా అన్ని సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి, ఆడిట్ ఎస్‌ఎండీ రఫీ, జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్ లక్ష్మీదేవి, క్రయ విక్రయదారులు పాల్గొన్నారు.

డిజిటల్‌కు నాంది.. భవితకు పునాది

చేతిలో ట్యాబ్..భుజానికి బ్యాగ్..చూడచక్కని యూనిఫాం..కాళ్లకి నాణ్యమైన షూస్...ఇవన్నీ విటుంటే ఏ ఇంటర్నేషనల్ స్కూలు లేదా కార్పొరేట్ స్కూళ్లోని విద్యార్థులు గుర్తుకొస్తున్నారు కదా!..నిజమే ఒకప్పుడు అలాంటి లుక్ కేవలం కార్పొరేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఉండేది. కానీ రోజులు మారాయి. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద వర్గాలకు కూడా ఆ తరహా సౌకర్యం సొంతమైంది. తమ పిల్లలకు చక్కటి యూనిఫాం, బూటు వేసి బడికి పంపాలన్న తల్లిదండ్రుల కల సాకారమైంది. ప్రభుత్వ బడులు కార్పొరేట్ లుక్‌ను సంతరించుకున్నాయి. బోధనలో సరికొత్త ట్రెండ్ తీసుకొచ్చేలా ట్యాబ్‌ల పంపిణీతో ప్రభుత్వ విద్యలో డిజిటల్ శకం ప్రారంభమైంది.

ట్యాబ్‌లతో విద్యార్థినీ విద్యార్థులు



విద్యార్థులకు 'జగన్ మామ' గిఫ్ట్

- బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌ల పంపిణీ
- ట్యాబ్ తోడుంటే ఉపాధ్యాయుడు వెంట ఉన్నట్లే
- విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో హర్షం

సాక్షి రాయచోటి: పేదలకు అన్ని సదుపాయాలతో కూడిన ఉన్నత విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు.ఇప్పటికే నాడు–నేడు పథకంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారగా, జగనన్న విద్యా కానుక, గోరుముద్ద వంటి పథకాలతో పేదల చదువులను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పుడు విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించేందుకు మరో ముందడుగు వేశారు. 8వ తరగతి చదువుతున్న పిల్లలకు ట్యాబ్‌లు అందించారు. చిన్నారులు వాటిని చేతబట్టుకుని కార్పొరేట్ లుక్‌తో మెరిసిపోతున్నారు. వారిని చూసి తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.

జిల్లాలో 407 పాఠశాలల్లో పంపిణీ

అన్నమయ్య జిల్లాలో 407 పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 17,728 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి 2084 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన తర్వాత జిల్లాలో పలు పాఠశాలల్లో స్థానిక ప్రజాప్రతినిధులు విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ట్యాబ్‌ల పంపిణీ వంద శాతం పూర్తి చేశారు.


సామాజిక అంతరాలకు చెక్

ప్రభుత్వ నిర్ణయంతో పేద పిల్లలకు డిజిటల్ విద్య అందడమే కాకుండా సామాజిక అంతరాలకు చెక్ పడనుంది.అపార్టుమెంట్ ప్లాట్‌లో ఉండే ఉన్నతాధికారి పిల్లలకు ట్యాబ్ లేదా ల్యాప్‌టాప్ ఉండడం సర్వసాధారణం. ఇప్పుడు అదే అపార్టుమెంట్‌లో 8వ తరగతి చదివే వాచ్‌మెన్ పిల్లల చేతిలో కూడా ట్యాబ్‌లు ఉంటాయి. చదువుల్లో సమానత్వం తీసుకొచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల పేద పిల్లల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎలాంటి విపత్తులు ఎదురైనా..

కరోనాతో పిల్లల చదువులు దూరమయ్యాయి. ముఖ్యంగా పేద పిల్లలు చదువుకు దూరమయ్యారు. ఉన్నత వర్గాల పిల్లలు ఆన్‌లైన్ తరగతులు విటుంటే పేదలు ఆ స్థోమత లేక పిల్లలను చదివించలేకపోయారు. ఈ నేపథ్యంలో డిజిటల్ విద్య పేరుతో పేదల పిల్లలకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందించింది. భవిష్యత్తులో కరోనా లాంటి ఏ విపత్తు వచ్చినా చదువులు కొనసాగేందుకు అవకాశం ఏర్పడింది.

ట్యాబ్‌లు ఇలా



సామ్‌సంగ్ కంపెనీ ట్యాబ్‌తోపాటు సెక్యూర్డ్ డిజిటల్ కార్డు అందించారు. పిల్లలకు సులువుగా పాఠాలు అర్థమయ్యేలా ప్రీలోడెడ్ బైజూస్ కంటెంట్ అందులో ఉంచారు. ఆఫ్‌లైన్‌లో పాఠాలు వినే అవకాశం కల్పించారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అవాంఛనీయ సైట్లకు చెక్ పెట్టారు. ఇక పిల్లలు ట్యూషన్‌కు వెళ్లాల్సిన అవసరం రాకపోవచ్చు.

విద్యాభివృద్ధికి సీఎం కృషి



పేదలకు అన్ని సదుపాయాలతో కూడిన ఉన్నత విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఇప్పటికే నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. ఇప్పుడు విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించేందుకు మరో ముందడుగు వేశారు. 8వ తరగతి చదువుతున్న పిల్లలకు ట్యాబ్‌లు అందించారు.

– పీఎస్ గిరీషా, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

100 శాతం ట్యాబ్‌లు అందజేశాం

జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ట్యాబ్‌లను అందజేశాం. నూటికి నూరు శాతం పంపిణీ పూర్తి చేశాం.ట్యాబ్‌ల ద్వారా సాంకేతిక నైపుణ్యంతో పాఠ్యాంశాల్లో పరిజ్ఞానం పెంచుకుని అనుకున్న లక్ష్యాల వైపు విద్యార్థులు ముందుకు వెళ్లాలి. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారు. ప్రతి విద్యార్థి ట్యాబ్‌లను సద్వినియోగ చేసుకోవాలి.

– రాఘవరెడ్డి, డీఈఓ, అన్నమయ్య జిల్లా

బైజూస్ పాఠాలతో బంగారు భవిష్యత్తు



బైజూస్ పాఠాలతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులందరికీ బంగారు భవిష్యత్తు ఉంటుంది. బైజూస్ ప్రీమియం యాప్ ద్వారా మ్యాథ్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, హిస్టరీ, జియాలజీ, సివిక్స్ సబ్జెక్టుల్లో అభ్యసన సులువుగా ఉంది. ఇంగ్లీషు, తెలుగుభాషల్లో ఉచిత ఈ–కంటెంట్ అందుబాటులో ఉంటుంది.ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2025 విద్యా సంవత్సరంలో సీబీఎస్‌ఈ విధానంలో ఇంగ్లీషు మీడియంలో 10వ తరగతి పరీక్ష రాసేందుకు ఈ ట్యాబ్‌లు ఉపయోగపడతాయి.

– మడితాటి నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, జెడ్పీ ఉన్నత పాఠశాల, సంబేపల్లె

జగన్‌మామ గిఫ్ట్



నా పేరు ఎస్.అంజుమా ఫైజా.రాయచోటి మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. తండ్రి వలీ, తల్లి నూర్జహాన్. నా తండ్రి ఆటో డ్రైవర్‌గా ఉంటూ నన్ను చదివిస్తున్నారు. 8వ తరగతిలో జగన్ మామ ఉచితంగా ట్యాబ్ ఇచ్చారు. ఎంతో సంతోషంగా ఉంది. బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకుంటాను.

బాగా చదువుకుంటాను



నా పేరు అర్బాత్. రాయచోటిలోని మాసాపేట ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. నా తండ్రి అహ్మద్‌బాషా. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తారు. తల్లి షాహీదాతో కలిసి మేము కొత్తపేటలో ఉంటున్నాము. కోవిడ్ సమయంలో ఆన్‌లైన్ క్లాసెస్ వినాలన్నా మా ఇంటిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉండేది కాదు. వేరే వాళ్ల దగ్గరికి వెళ్లి చదువుకునే వాళ్లం. జగనన్న ట్యాబ్ ఇచ్చారు. బాగా చదువుకుంటాను.

పాఠ్యాంశాలు సులువుగా



నా పేరు ఎస్.అయేషా. రాయచోటిలోని ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుకుంటున్నాను. నా తండ్రి వ్యవసాయం చేస్తుంటారు. తల్లి హసీన్ తాజ్. ట్యాబ్‌లో పాఠ్యాంశాలుగా సులువుగా అర్థమవుతున్నాయి. తరగతి గదిలో చెప్పిన పాఠాలు ట్యాబ్ లో తిరిగి రివిజన్ చేసుకోవచ్చు. ఇక ఏ చాప్టర్‌లో డౌట్ వచ్చినా ఏ క్షణంలోనైనా ఒకటికి పది సార్లు రివిజన్ చేసుకునే వీలుంటుంది.

క్లుప్తంగా

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

రామసముద్రం : కుదురుచీమనపల్లె గ్రామంలో ఒక మహిళ మెడలో గుర్తు తెలియని దుండగులు బంగారు గొలుసు లాక్కొని పారిపోయిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కుదురుచీమనపల్లె గ్రామంలో ఓబుల్‌రెడ్డి చిల్లర దుకాణం ఉంది. దుకాణంలో అతని భార్య నిర్మల వ్యాపారం చేస్తుండగా.. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి టీ ఇవ్వాలని అడిగారు. ఆమె టీ ఇచ్చేందుకు ప్లాస్క్ దగ్గరకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కున్నాడు. అప్పటికే ద్విచక్రవాహనంపై ఉన్న వ్యక్తితో కలిసి ఇద్దరు అక్కడి నుంచి పారిపోయారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాల వద్ద అనుమానాస్పద స్థితిలో దివ్య (25) అనే మహిళ మృతి చెందింది. ఎస్ఐ బి. అరుణ్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రోడ్డు కృష్ణాపురంలోని శివ సంధ్య నగర్‌కు చెందిన లోకాంజనేయులు దివ్యకు నాలుగు సంవత్సరాల కిందట వివాహం జరిగింది. వీరి మధ్య గతంలో మనస్పర్థలు రావడంతో విడిపోయారు. ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేసి ఇద్దరినీ కలపడం జరిగింది. తన భార్యతో కలిసి కడప నగరానికి వెళ్లి తన ఇంటికి తీసుకొని వస్తుండగా మార్గం మధ్యలో బైక్‌పై నుంచి పడి మృతి చెందినట్లు లోకాంజనేయులు తెలిపారు. తన కుమార్తెను తన అల్లుడే చంపినట్లు మృతిరాలి తల్లి లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వంగ సాగు.. లాభాలు బాగు

- ఐదు నెలల తరువాత పుంజుకొన్న ధరలు
- మార్కెట్‌లో కిలో రూ.22
- కర్ణాటక, తమిళనాడులో భారీగా డిమాండ్
- టమాట, పూలతోటలతో నష్టపోయిన రైతులు
- వంగ సాగుతో లాభాల బాటలో అన్నదాతలు



చెరువుమొరవపల్లెలో సాగు చేసిన వంగ తోట



రవాణాకు సిద్ధంగా ఉంచిన వంకాయలు

గుర్రంకొండ : జిల్లాలో టమాట, పూలతోటల సాగుతో నష్టపోయిన రైతులను ప్రస్తుతం వంగ సాగు ఆదుకుంటోంది. సుమారు ఐదు నెలల తరువాత మార్కెట్‌లో వంగ ధరలు పుంజుకొన్నాయి. ప్రస్తుతం కిలో రూ.22 వరకు పలుకుతున్నాయి. మన రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం మంచి డిమాండ్ ఉంది. దీంతో జిల్లాలో వంగ సాగు రైతుల కష్టాలు తీర్చి లాభాలు తీసుకొస్తోంది.

జిల్లాలో 3250 హెక్టార్లలో సాగు

జిల్లాలో ఈ సీజన్‌లో 3250 హెక్టార్లలో వంగ తోటల సాగు చేపట్టారు. ఎకరం సాగుకు దుక్కుల దగ్గర నుంచి కాయలు కోతకు వచ్చేంత వరకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు వస్తోంది. మొక్క ఎదుగుదలకు, పూతపిందె నిలవడానికి గానూ వారానికి ఒక సారి మందులు స్ప్రే చేయాల్సి ఉంటుంది. మొక్కకు సత్తువ ఇచ్చి కాయలు ఎక్కువ కాయడానికి ఎరువులు, మందుల కోసం ప్రతి వారం సుమారు రూ. 6 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మొక్కలు నాటిన 90 రోజులకు కాయలు కాయడం మొదలవుతుంది. సుమారు మూడు నెలల పాటు కాయల కోత ఉంటుంది.

ఎకరానికి రూ.3 లక్షల ఆదాయం

ఈ ఏడాది వంగ తోటల నుంచి మంచి దిగుబడి వస్తోంది. తద్వారా ఎకరానికి గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఎకరానికి 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.20 నుంచి రూ.22 వరకు ధర పలుకుతున్నాయి. అంకూర్ మిగిలిన రకాలు కిలో రూ. 15 నుంచి రూ. 25 వరకు పలుకుతున్నాయి. మార్కెట్లో మొదటి రకం కిలో రూ.22, రెండో రకం కిలో రూ.18, మూడో రకం కిలో రూ.14 వరకు ధరలు పలుకుతున్నాయి. ఈలెక్కన ఎకరానికి రూ. 2.20 లక్షల నుంచి రూ. 2.64 లక్షల వరకు ఆదాయం వస్తుంది. అంకూర్ మిగిలిన రకాలైతే రూ.1.50 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు ఆదాయం వస్తుంది. గత ఇరవై రోజులుగా ఇవే ధరలు మార్కెట్లో నిలకడగా ఉండడంతో రైతులు ఇప్పుడిప్పుడే లాభాల బాట పడుతున్నారు.

సంక్రాంతి సీజన్ ప్రారంభం కావడంతో..

సుమారు ఐదు నెలల తరువాత మార్కెట్లో వంగ ధరలు పుంజుకొన్నాయి. ఐదు నెలల క్రితం ధరలు పతనమవడంతో పలువురు రైతులు తోటలు దున్నేశారు. గతంలో తమిళనాడు రాష్ట్రంలో కురిసిన వర్షాలకు అక్కడి తోటలు భారీగా దెబ్బతిని దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దీంతో మన జిల్లా వంగకు అక్కడి మార్కెట్లలో మంచి డిమాండ్ ఏర్పడింది. దీనికితోడు నెలల తరబడి ధరలు పుంజుకోక పోవడంతో రైతులు ఢీలాపడ్డారు. ప్రస్తుతం సంక్రాంతి సీజన్ ప్రారంభం కావడంతో తమిళనాడుకు ఎక్కువగా మన జిల్లా వంగ ఎగుమతి చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో వంగతోటలు అంతంత మాత్రంగా ఉండడంతో మన జిల్లా వంగ అక్కడికి ఎగుమతి అవుతోంది. ఓవైపు దిగుబడి లేక పోవడంతో మరోవైపు సంక్రాంతి సీజన్ ప్రారంభం కావడంతో వంగ ధరలు ఒక్కసారిగా పుంజుకొన్నాయి.

బెంగళూరు, చెన్నైలో మంచి డిమాండ్

మన జిల్లాలో సాగు చేసే వంకాయలకు బెంగళూరు, చెన్నైలో మంచి డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా మద్రాసు రకం వంకాయలు అక్కడి మార్కెట్లో మంచి ధరలు పలుకుతున్నాయి. దీంతో ఇక్కడ సాగు చేసే వంకాయలను తిరుపతి, కడప, చెన్నై, బెంగళూరు మార్కెట్లకు ఎగుమతి చేస్తుంటారు. కొన్ని ప్రాంతాల్లో బయట రాష్ట్రాల వ్యాపారులే నేరుగా తోటల వద్దకు వచ్చి కాయల్ని కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. ప్రస్తుతం కోత కూలీలు, రవాణా, పెట్టుబడి సాగు ఖర్చులు పోనూ రైతులు లాభాలు చవిచూస్తున్నారు.

వంగ సాగు ఆదుకుంటోంది



టమాట సాగు చేసి ఈ ఏడాది పూర్తిగా నష్టపోయాం. ప్రస్తుతం వంగతోటల సాగు మమ్మల్ని ఆదుకుంటోంది. టామాటతో పోల్చుకుంటే ఇరవై రోజులుగా మార్కెట్లో వంగ ధరలు నిలకడగా ఉన్నాయి. ఇవే ధరలు మరి కొద్ది రోజులు ఉంటే కష్టాలన్నీ తీరిపోతాయి. మంచి లాభాలు చూడడంతోపాటు ఎకరానికి అన్ని ఖర్చులు పోనూ రూ. 2.50 లక్షల ఆదాయం సమకూరే అవకాశముంది.

\- రమణమ్మ, రైతు, గంగనపల్లె

రెండు ఎకరాలలో సాగు చేశా



రెండు ఎకరాల పొలంలో వంగ తోట సాగు చేశాను. మద్రాసు రకం వంగ సాగు చేశాను. ప్రస్తుతం మార్కెట్లో వీటి ధరలు బాగానే ఉన్నాయి. టమాటతో నష్టపోయిన రైతులకు వంగ సాగుతో కొంత ఊరట వస్తోంది. మార్కెట్లో ఇప్పుడు కొద్ది రోజులుగా ధరలు నిలకడగా ఉన్నాయి. ధరలు ఇలాగే ఉంటే రైతులు కష్టాలు తీరుతాయి.

\- రెడ్డిమోహన్, రైతు, చెరువుమొరవపల్లె

చిరుత సంచరిస్తోందని ఆందోళన

ముద్దనూరు : ముద్దనూరు–గండికోట జలాశయం ప్రధాన రహదారిలోని శెట్టివారిపల్లె గ్రామ కొండ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తోందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సోమవారం శెట్టివారిపల్లె గ్రామ శివారులో ఊటుకోన సమీపంలో చిరుతపులి మేకల మందపై దాడి చేసిందని, ఇందులో 5 మేకలు మృతి చెందాయని జీవాల యజమానులు తెలిపారు. తమ మందలో 5 మేకలు లేకపోవడంతో అవి చనిపోయినట్లుగా భావిస్తున్నామని వారు పేర్కొన్నారు. చనిపోయిన రెండు మేకలను వారు గుర్తించారు. కొండ ప్రాంతంలో వున్న తమ గ్రామంలో సుమారు 3 నెలల నుంచి భయాందోళనకు గురవుతున్నా అటవీ శాఖ అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

అంతర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక



అంతర్‌యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నెహ్రూ రోడ్డులోని వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు త్వరలో జరగనున్న అంతర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల యోగివేమన యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్ కళాశాలల ఖోఖో మహిళల పోటీల్లో కళాశాల విద్యార్థినులు శిరీష, నాగనవీన, హరిచందన, ధనలక్ష్మి, తస్లీమ్, అమృత వర్షిణి, కరిష్మాలు ప్రతిభ కనపరచారు. ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు, రూ.5 వేల నగదు బహుమతి అందుకున్నారు. వీరిలో శిరీష, నాగనవీన, హరిచందన, ధనలక్ష్మి త్వరలో జరుగనున్న అంతర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు.

విహారం.. విషాదం



గుర్రంకొండలో కింద పడిన బైక్



అబ్దుల్ అజీజ్(ఫైల్)



హమీద్(ఫైల్)

- నూతన సంవత్సరం వేడుకల కోసం ప్రాజెక్టు వద్దకు..
- తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదం
- కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పిన బైక్
- ఇద్దరు యువకుల మృతి, మరొకరికి గాయాలు

గుర్రంకొండ : విహారం విషాదంగా మారింది. కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి తంబళ్లపల్లె పెద్దేరు ప్రాజెక్టు వద్దకు వెళ్లి నూతన సంవత్సరం వేడుకలను సంతోషంగా జరుపుకొన్నారు. ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. రోడ్డుకు అడ్డంగా వస్తున్న కుక్కను ఢీకొని బైక్ కింద పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంకొండ పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన పఠాన్ షామీర్ కుమారుడు పఠాన్ హమీద్(29) స్థానిక మార్కెట్‌యార్డులో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. హమీద్‌కు సమీప బంధువులైన వైఎస్సార్ జిల్లా కడప పట్టణం ఆర్‌కే నగర్‌కు చెందిన ఎస్.అబ్దుల్ అజీజ్(29), ఎస్.అయూబ్(23) నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకొనేందుకు గుర్రంకొండకు వచ్చారు. హమీద్, అబ్దుల్‌అజీజ్ కుటుంబ సభ్యులు నూతన సంవత్సరాన్ని ఆనందంగా గడపడానికి ఆదివారం తంబళ్లపల్లె పెద్దేరు ప్రాజెక్టు వద్దకు ఆటలో బయలుదేరారు. హమీద్, అబ్దుల్ అజీజ్, అయూబ్ ద్విచక్ర వాహనంలో ఆటోతోపాటు బయలుదేరి వెళ్లారు. అందరూ కలసి పెద్దేరు ప్రాజెక్టు వద్ద రాత్రి వరకు గడిపారు. ఆటోలో వారి కుటుంబ సభ్యులు తిరిగి గుర్రంకొండకు వచ్చేశారు. హమీద్, అబ్దుల్ అజీజ్, అయూబ్ వారితోపాటు రాకుండా ఆలస్యంగా ఇంటికి బయలు దేరారు. మార్గంమధ్యలో గుర్రంకొండకు సమీపంలోని గాజులవారిపల్లె వద్ద వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం రోడ్డుకు అడ్డంగా వెళుతున్న ఊర కుక్కను ఢీకొని కింద పడింది. ఈ ప్రమాదంలో అబ్దుల్ అజీజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన హమీద్, అయూబ్‌ను 108 ద్వారా మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తీసుకెళ్లాల్సిందిగా ఆస్పత్రి వైద్యులు సూచించారు. తిరుపతికి తీసుకెళుతుండగా మార్గంమధ్యంలో హమీద్ మృతి చెందాడు. గాయాల పాలైన అయూబ్‌ను చికిత్స నిమిత్తం వారి కుటుంబ సభ్యులు కడపకు తరలించారు. హమీద్, అబ్దుల్ అజీజ్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నరసింహులు తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారంలో చొరవ చూపాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ వి.బిరాజ్‌కమల్

రాయచోటి : స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో జిల్లాలోని పోలీసు అధికారులు చొరవ చూపాలని అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ వి.బి రాజ్‌కమల్ సూచించారు. సోమవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ స్పందన కార్యక్రమంలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ముఖాముఖి మాట్లాడి వాటి పరిష్కారంపై చొరవ చూపారు. ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులకు టెలి కాన్ఫరెన్సు ద్వారా ఆదేశించారు. అన్నమయ్య జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో 50 ఫిర్యాదులు అందాయని ఏఎస్పీ తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

మదనపల్లె : మద్యం మత్తులో యువకుడిపై కత్తితో దాడి చేసిన సంఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం చింతవారిపల్లెకు చెందిన మధు(25) పట్టణంలోని ఎస్టేట్‌లో ఓ దుకాణంలో పని చేస్తున్నాడు. ఇదే దుకాణంలో పని చేసే ఆది మద్యం మత్తులో మధుతో ఘర్షణ పడ్డాడు. ఈ గొడవలో ఆది కత్తితో మధుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడిని స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి మధ్య వాగ్వివాదం పెరిగి దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాప్ కేసులో వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లె : కిడ్నాప్ కేసులో వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఫాతిమా తెలిపారు. ఎస్ఐ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంగంవారిపల్లె పంచాయతీ కొండసానివారిపల్లెకు చెందిన మైనర్ బాలిక (15) గత నెల 23 నుంచి కనిపించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి తర్వాత కిడ్నాప్ కేసుగా మార్చారు. ఈ కేసులో నిందితుడైన నిమ్మనపల్లె పంచాయతీ గూడుపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు గెరివి వెంకటేష్ (23)ను చల్లావారిపల్లె క్రాస్ వద్ద సోమవారం అరెస్ట్ చేశారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం తరలించారు.

శభాష్..వలంటీర్



బెంగళూరులో కిడ్నీ బాధితురాలు వసంతకు డయాలసిస్ పెన్షన్ అందిస్తున్న వలంటీర్ షఫీ

నిమ్మనపల్లె : కిడ్నీ వ్యాధితో బాధపడుతూ బెంగళూరులో చికిత్స పొందుతున్న ఓ మహిళకు వలంటీర్ అక్కడికి వెళ్లి పెన్షన్ అందించి అందరిచేత శభాష్ అనిపించుకున్నాడు. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలంలోని అగ్రహారం పంచాయతీ మంచిగుంటపల్లెకు చెందిన శ్రీనివాసులు భార్య వసంత కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ప్రభుత్వం ఆమెకు డయాలసిస్ పింఛన్ కింద ప్రతినెలా రూ.10,000 అందజేస్తోంది. రెండునెలలుగా ఆమెకు వ్యాధి తీవ్రత పెరగడంతో బెంగళూరులోని ఫోర్టిస్ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతోంది. నెలరోజుల క్రితం శస్త్రచికిత్స నిర్వహించారు. వైద్యసేవల నిమిత్తం ఆమె ఇప్పటికీ అక్కడే ఉంటోంది. దీంతో రెండునెలలుగా పెన్షన్ తీసుకునేందుకు గ్రామంలో అందుబాటులో లేకుండా పోయింది. దీంతో వలంటీర్ షఫీ రెండునెలలుగా సొంతఖర్చులతో బెంగళూరుకు వెళ్లి పెన్షన్ అందించాడు. సుమారు 170కి.మీ.లు పైగా ప్రయాణించి బాధితురాలికి పెన్షన్ అందించడంపై ఎంపీడీఓ లీలామాధవి, పంచాయతీ కార్యదర్శి మంజుల, వెల్ఫేర్ అసిస్టెంట్ జావీద్, సచివాలయ సిబ్బంది వలంటీర్ షఫీని అభినందించారు. ఈ సందర్భంగా కిడ్నీ బాధితురాలు వసంత మాట్లాడుతూ ఆరోగ్యం బాగోలేక తాను బెంగళూరులో ఉంటే శ్రమకు ఓర్చి వైద్యఖర్చుల కోసం పనికివస్తాయంటూ వలంటీర్ పెన్షన్ అందించినందుకు, తమలాంటి వారికోసం వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టిన ప్రభుత్వానికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

పందిని తప్పించబోయి..

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం



నరసింహ(ఫైల్)

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పొట్లదుర్తి–బిస్మిల్లాబాదు గ్రామాల మధ్య స్కూటర్‌పై వస్తున్న వీరబోయిన ఉగ్రనరసింహ (27)కు సోమవారం పంది అడ్డు రావడంతో తప్పించబోయి కింద పడి దుర్మరణం చెందాడు. ఎర్రగుంట్ల సీఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పొట్లదుర్తి గ్రామానికి చెందిన వీరబోయిన శ్రీనివాసులు కుమారుడు వీరబోయిన ఉగ్రనరసింహ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వాడు. ఇంకా వివాహం కాలేదు. ఆదివారం రాత్రి బిస్మిల్లాబాదు నుంచి స్కూటర్‌పై పొట్లదుర్తికి బయలు దేరాడు. ఈ మధ్యలో రోడ్డుకు అడ్డంగా పంది వచ్చింది. దాన్ని తప్పించబోయి కింద పడి గాయాలపాలై మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడి అన్న నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అరుణాచల్‌ప్రదేశ్‌పై ఆంధ్రా ఘన విజయం

- అండర్–25 క్రికెట్ మ్యాచ్‌లో రెండో రోజే దక్కిన విజయం
- ద్విశతకంతో నాటౌట్‌గా నిలిచిన ఆంధ్రా బ్యాట్స్‌మన్ మహీప్



తలపడుతున్న ఆంధ్ర–అరుణాచల్‌ప్రదేశ్ జట్లు



డబుల్ సెంచరీ, 4 వికెట్లు తీసిన ఆంధ్రా ఆల్‌రౌండర్ మహీప్‌కుమార్



157 పరుగులు చేసిన ఆంధ్రా బ్యాట్స్‌మన్ వంశీకృష్ణ

కడప స్పోర్ట్స్ : కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్రాల అండర్–25 క్రికెట్ మ్యాచ్‌లో అరుణాచల్‌ప్రదేశ్ జట్టుపై ఆంధ్రా జట్టు ఘనవిజయం సాధించింది. 264 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు సోమవారం బరిలోకి దిగిన ఆంధ్రా జట్టు 369 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని మహీప్‌కుమార్ 251 బంతుల్లో 24 ఫోర్లు, 5 సిక్సర్‌లతో 200 పరుగులతో నాటౌట్‌గా నిలిచి ద్విశతకం నమోదు చేశాడు. ఈయనకు జతగా టి.వంశీకృష్ణ 212 బంతుల్లో 21 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 157 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. వీరిద్దరూ కలిసి 359 పరుగుల భారీ భాగస్వామ్యం సాధించడం విశేషం. దీంతో కేవలం 1 వికెట్ నష్టానికి ఆంధ్రా జట్టు 369 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్ ప్రదేశ్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి అరుణాచల్‌ప్రదేశ్ జట్టు 72 ఓవర్లలో 218 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నబమ్ జోష్ 66 పరుగులు, లిచా జాన్ 43 పరుగులు, దాడో టచుంగ్ 33 పరుగులు చేశాడు. ఆంధ్రా బౌలర్లు మహీప్‌కుమార్ 4 వికెట్లు, ఎం.ఆంజనేయులు 3 వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో అరుణాచల్‌ప్రదేశ్ జట్టు 40 పరుగులకే ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. దీంతో ఆంధ్రా జట్టు 111 పరుగుల ఆధిక్యంతో ఘన విజయం సాధించింది. దీంతో ఇన్నింగ్స్ ఆధిక్యంతో విజయం సాధించిన ఆంధ్రా జట్టుకు 7 పాయింట్లు లభించాయి.

భార్యపై భర్త దాడి

నిమ్మనపల్లె : భార్యపై భర్త దాడి చేసిన సంఘటన సోమవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజిగారిపల్లెకు చెందిన లక్ష్మీనారాయణ తన భార్య మాధవి(28)పై కుటుంబ సమస్యల కారణంగా దాడి చేశాడు. మద్యం మత్తులో విచక్షణా రహితంగా కర్రలతో కొట్టాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్న బాధితురాలిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణానికి చెందిన కె.ప్రసాద్ బాబ(37) అనే వ్యక్తి ఆదివారం అర్ధరాత్రి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొన్నట్లు సమాచారం. మృతుడి భార్య కొద్ది కాలం క్రితం ఆత్మహత్య చేసుకొన్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది. భార్య మృతితో మనస్తాపానికి గురై అతనూ ఆత్మహత్య చేసుకొన్నట్లు స్థానికులు తెలిపారు. రైల్వే ఎస్ఐ కే రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.